సాక్షి
సూర్యాపేట
ఆదివారం । 5 । జనవరి । 2025



**రాష్ట్రస్థాయికి ఎంపిక**
నల్లగొండలో జరిగిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో 25 ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. - 8లో



**ఉలిక్కిపడిన పెద్దకందుకూరు**
పెద్దకందుకూరులోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో పేలుడు సంభవించడంతో గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. - 8లో



**వినిపించని కిలకిలరావాలు**
గ్లోబల్ వార్మింగ్ కారణంగా వాతావరణంలో విపరీత మార్పులు రావడంతో పక్షులు అంతరించిపోతున్నాయి. - 10లో

## న్యూస్‌రీల్

### సమగ్ర ఎరువుల యాజమాన్యం పాటించాలి



రైతులకు సూచనలు చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి

**నడిగూడెం:** వరి సాగులో సమగ్ర ఎరువుల యాజమాన్యం పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. నడిగూడెం మండల కేంద్రంలో పలువురు రైతులు వెదజల్లే పద్ధతిలో సాగు చేసిన వరి పొలాలను శనివారం ఆయన పరిశీలించిన అనంతరం రైతులతో మాట్లాడారు. మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడొద్దన్నారు. వాతావరణ మార్పుల వలన జింకు లోపిస్తుందని, దీని నివారణకు చీలేటెడ్ జింకును పిచికారీ చేయాలన్నారు. ఆయన వెంట కోదాడ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు డి.యల్లయ్య, ఏఈఓ పిచ్చయ్య, రైతులు ఉన్నారు.

### ఉద్యమకారులకు న్యాయం జరిగేలా కృషి



మాధవిని సన్మానిస్తున్న తెలంగాణ ఉద్యమకారుల వేదిక జేఏసీ నాయకులు

**సూర్యాపేటటౌన్:** తెలంగాణ మలిదశ ఉద్యమకారులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని తెలంగాణ ఉద్యమకారుల వేదిక జేఏసీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కోతి మాధవి అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల వేదిక జేఏసీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా ఆమె నియామకమయ్యారు. ఈ సందర్భంగా శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాధవి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలు అమలయ్యే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. సమావేశంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పిడమర్తి లింగయ్య, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు కోడి సైదులు యాదవ్, సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్కే యూసుఫ్ షరీఫ్, అధికార ప్రతినిధి లక్కపాక కృష్ణ, భారీఖాన్, అమృనాయక్, మామిడి శెట్టి అంజయ్య, కట్ట రాజన్న, మేడబోయిన గంగయ్య, కంచుగట్ల దశరథ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి



ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న జిల్లా అధికారి తీగల నాగయ్య తదితరులు

**నాగారం:** మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న ఆయిల్ పామ్ తోటల సాగుపై రైతులు దృష్టి సారిస్తే ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి తీగల నాగయ్య అన్నారు. శనివారం నాగారం మండల కేంద్రంలో ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించి మాట్లాడారు. నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్ పామ్ సాగు చేసుకొని, అధిక లాభాలు పొందవచ్చన్నారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం బిందు సేద్యం, ఎరువులకు, అంతర పంటలకు సబ్సిడీ ఇస్తుందన్నారు. ఆయిల్ పామ్ తోటలు సాగుకు ఆసక్తి గల రైతులు ఉద్యాన శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ ఉద్యాన అధికారి ప్రమిత, మాజీ వైస్ ఎంపీపీ గుంటకండ్ల మణిమాల, పతంజలి ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ అశోక్, క్షేత్ర సహాయకులు రంగు ముత్యంరాజు, ప్రభాకర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### సర్వేను పకడ్బందీగా పూర్తిచేయాలి

**నడిగూడెం:** ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా పూర్తిచేయాలని గృహనిర్మాణ శాఖ ఈఈ జేఎస్ఎన్.మూర్తి కోరారు. శనివారం నడిగూడెం మండలం చాకిరాలలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించిన అనంతరం ఆయన అధికారులతో మాట్లాడారు. జిల్లాలో ఎక్కడాలేని విధంగా చాకిరాలలో అధికంగా అద్దె ఇళ్లలో ఉంటున్నట్లు సర్వేలో నమోదు చేశారన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ సయ్యద్ ఇమామ్, కార్యదర్శి ప్రత్యూష ఉన్నారు.

## 803 ఇళ్లకు లక్కీ డ్రా

**సూర్యాపేట టౌన్:** పేదల సొంతింటి కల నెరవేర్చిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. సూర్యాపేటలో నిర్మించిన 803 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను శనివారం స్థానిక సుమంగళి ఫంక్షన్ హాల్‌లో లక్కీడ్రా పద్ధతిన లబ్ధిదారులకు కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే గృహప్రవేశాలు చేసుకుందామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ వేణుమాధవరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పి.అన్నపూర్ణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.





లక్కీ డ్రా తీసిన అనంతరం నంబర్‌ను ప్రకటిస్తున్న జగదీష్‌రెడ్డి, హాజరైన దరఖాస్తుదారులు

# బియ్యం రవాణాకు బ్రేక్

## పెంచిన కూలి రేట్లు అమలు చేయాలని సమ్మెకు దిగిన హమాలీలు

- ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద నాలుగు రోజులుగా దీక్షలు
- రేషన్ షాపులు, విద్యాసంస్థలకు ఆగిన బియ్యం సరఫరా
- సమ్మెలో 240 మంది కార్మికులు



హమాలీల సమ్మెకు మద్దతు తెలుపుతున్న నాయకులు

**కోదాడ:** మండల లెవల్ స్టాక్ పాయింట్ (ఎంఎల్ఎస్‌పీ)ల వద్ద పనిచేస్తున్న సివిల్ సప్లయ్ హమాలీ కార్మికుల సమ్మెతో రేషన్ బియ్యం సరఫరా నిలిచిపోయింది కార్మికులు చేస్తున్న సమ్మె ఆదివారానికి నాలుగో రోజుకు చేరింది. అయినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించడం లేదు. ఫలితంగా రేషన్ దుకాణాలు, సంక్షేమ వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు మొదటి తేదీలోపే సరఫరా కావాల్సిన బియ్యం సరఫరాకు బ్రేక్ పడింది. మరో పది రోజుల్లో సంక్రాంతి పండుగ వస్తుందని ఈలోపైనా కార్మికుల సమస్యలను పరిష్కరించి రేషన్ బియ్యం సరఫరా అయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

**జిల్లాలో నాలుగు ఎంఎల్ఎస్ పాయింట్లు**

జిల్లాలోని కోదాడ, సూర్యాపేట, హుజూర్‌నగర్, తుంగతుర్తిలో మండల్ లెవల్ స్టాక్ పాయింట్లు (ఎంఎల్ఎస్‌పీ)లు ఉన్నాయి. ఇక్కడి నుంచి స్టేజీటు కాంట్రాక్టర్ ఆధ్వర్యంలో లారీలలో రేషన్ దుకాణాలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం పంపిణీ జరుగుతుంది. ప్రధాన గోదాము నుంచి ఇక్కడికి వచ్చే బియ్యాన్ని దిగుమంతి చేయడం, ఇక్కడి నుంచి రేషన్ దుకాణాలకు సరఫరా చేసే వాహనాల్లో లోడ్ చేయడంతో పాటు రేషన్ దుకాణాల్లో బియ్యాన్ని అన్‌లోడ్ చేయడానికి ప్రతి ఎంఎల్ఎస్‌పీ వద్ద 50 నుంచి 60 మంది వరకు హమాలీలు పనిచేస్తుంటారు. ప్రతి ఎంఎల్ఎస్‌పీ నుంచి 7 నుంచి 10 వేల క్వింటాళ్ల బియ్యం ప్రతినెలా ఎగుమతి, దిగుమతి చేస్తుంటారు. జిల్లా వ్యాప్తంగా 240 మంది హమాలీ కార్మికులు ఉన్నారు.

**సమ్మె ఎందుకు చేస్తున్నారంటే...**

ఎంఎల్ఎస్‌పీ వద్ద పనిచేసే కార్మికుల ఎగుమతి దిగుమతి చార్జీలను ప్రతి రెండేళ్లకు ఒకసారి పెంచాల్సి ఉంటుంది. దీనికోసం 2024 అక్టోబర్ నెలలో కార్మిక సంఘాలతో పౌరసరఫరాల శాఖ అధికారులు చర్చలు జరిపారు. గతంలో బస్తాను గోదాము వద్ద లోడ్ చేయడంతో పాటు రేషన్ దుకాణం వద్ద దిగుమతి చేయడానికి రూ.26 ఇచ్చేవారు. దానికి రూ.29 చెల్లించే విధంగా ఒప్పందం కుదిరింది. పెంచిన చార్జీలను జనవరి 2024 నుంచి అమలు చేస్తామని నాడు అధికారులు హామీ ఇచ్చారు. ఇది జరిగిన నాలుగు నెలలైనా జీఓను విడుదల చేయకపోవడంతో కార్మికులు ఈ నెల 2 నుంచి సమ్మెకు దిగారు. ప్రతి గోదాము వద్ద నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు.

**నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి**

**కోదాడ రూరల్:** ఒప్పందం ప్రకారం పెంచిన కూలిరేట్ల వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులు కోదాడలోని సివిల్ సప్లయీస్ గోదాము దగ్గర చేస్తున్న సమ్మె ఆదివారం నాలుగో రోజు కొనసాగింది. ఈ సమ్మెకు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు మద్దతు తెలిపి మాట్లాడారు. హమాలీ కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. సమ్మెలో హమాలీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు పోలంపల్లి కొండలు, గౌరీనాయుడు, టి.శ్రీనివాస్, మీరా లక్ష్మణ్, గోవింద్, ఆదినారాయణ పాల్గొన్నారు.

**హమాలీ కార్మికులను ఆదుకోవాలి**

రెండు సంవత్సరాలుగా సివిల్ సప్లయ్ గోదాముల వద్ద పనిచేస్తున్న హమాలీ కార్మికుల వేతనాలు పెరగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు నెలల క్రితం హమాలీ చార్జీలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నా నేటికి దాన్ని అమలు చేయలేదు. పెంచిన ధరలను జనవరి 2024 నుంచి అమలు చేయడంతో పాటు వెంటనే దీనికి సంబంధించిన జీఓ విడుదల చేయాలి. అంత వరకు సమ్మెను విరమించేది లేదు.

– మేకల శ్రీనివాసరావు, సివిల్ సప్లయ్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు

## నర్సిరెడ్డిని ఎమ్మెల్సీగా మరోసారి గెలిపించాలి




మాట్లాడుతున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి, చిత్రంలో ఆ సంఘం నాయకులు

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి

**సూర్యాపేట టౌన్:** ప్రభుత్వ విద్యారంగ రక్షణకోసం ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోసారి గెలిపించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి అన్నారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్)ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కాకినాడలో జరుగుతున్న స్వర్ణోత్సవ మహాసభలకు హైదరాబాద్ నుంచి బయలుదేరిన పతాక జాతాలు శనివారం సూర్యాపేట పట్టణానికి చేరుకున్నాయి. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానం, 5, 8 తరగతులలో డిటెన్షన్ విధానాన్ని అమలు చేయవద్దన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్, రాష్ట్ర కార్యదర్శులు సీహెచ్.రాములు, జి.నాగమణి, వి.శాంతి కుమార్, జి.శ్రీధర్, రవికుమార్, వెంకటప్ప, ఎస్.సోంబాబు, ఎస్.అనిల్ కుమార్, బి.శ్రీనివాసాచారి, పి.వెంకటేశం, అరుణ భారతి పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

**భానుపురి (సూర్యాపేట):** మున్సిపల్ కార్మికులకు కనీస వేతనంగా నెలకు రూ.26వేలు చెల్లించాలని మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నెమ్మాది వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం సూర్యాపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం అమలు చేయకుండా వెట్టిచాకిరీ చేయించుకోవడం తగదన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కమిషనర్ శ్రీనివాస్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దశరథ, మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు చాగంటి రమణ, కార్యదర్శి శివ, ఎల్లమ్మ, పాండు, సామ్యూషన్, వెంకన్న, ధనమ్మ, సాయి పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

## అంధులకు వెలుగు రేఖ.. బ్రెయిలీ లిపి

- అదనపు కలెక్టర్ రాంబాబు

**భానుపురి (సూర్యాపేట):** అంధులకు వెలుగు రేఖ బ్రెయిలీ లిపి అని, దాన్ని కనిపెట్టిన లూయిస్ బ్రెయిలీ చిరస్మరణీయులని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. శనివారం సూర్యాపేనట కలెక్టరేట్‌లో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడారు. అనంతరం పలువురు ఉద్యోగులను అదనపు కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రవీందర్, బ్లైండ్ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సోమయ్య, వెంకటయ్య, శ్రీకాంత్, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి లత, మెప్మా పీడీ రేణుక, జిల్లా శిశు, మహిళా, వికలాంగుల సంక్షేమ శాఖ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు తదితరులు

## ప్రశ్నిస్తేనే ప్రజాస్వామ్య మనుగడ సాధ్యం

- టీవీవీ రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య

**సూర్యాపేట టౌన్:** ప్రశ్నించడం ద్వారానే ప్రజాస్వామ్యం మనుగడ సాగించడం సాధ్యమని తెలంగాణ విద్యావంతుల వేదిక (టీవీవీ) రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని కుడకుడలో సూర్యాపేట సామాజిక అధ్యయన వేదిక ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా వేదిక కన్వీనర్ ఎల్.భద్రయ్య అధ్యక్షతన ×ప్రభుత్వాలు, ప్రజాస్వామిక విలువల్లుఅనే అంశంపై శనివారం నిర్వహించిన సెమినార్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కులానికి ఒక న్యాయం చెప్పిన మనుధర్మం ప్రజల నెత్తిన స్వారీ చేయడం ఖాయమన్నారు. వివక్ష లేని సమాజ స్థాపనకు కంకణబద్ధులు కావాలన్నారు. కార్యక్రమంలో వేదిక కోకన్వీనర్, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రేపాక లింగయ్య, టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముప్పని కృష్ణారెడ్డి, ఆర్.రామనర్సయ్య, పి.వీరన్న, బీవీ.రావు, జె.రమణ, అరుణ జ్యోతి, కె.యోగానంద్, కె.వేణు, ఆనంద్ భాస్కర్, బండారు శ్రీనివాస్, యాకయ్య, క్రాంతికుమార్, ఉమర్, చామకూరి నర్సయ్య, కరీం, వెంకట్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంబటి నాగయ్య



**కూ**లి పనిచేశాడు.. మిర్చి బండి వద్ద పనిచేశాడు.. ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ విద్యాభ్యాసం కొనసాగించాడు.. ఇలాంటి ఓ సామాన్యుడు.. ఒళ్లు గుగుర్పొడిచే సాహస విన్యాసాలతో సత్తా చాటుతున్నాడు. ఏకంగా నాలుగు గిన్నిస్ రికార్డులు నెలకొల్పి ప్రతిభకు పేదరికం అడ్డురాదని నిరూపించాడు.. పనికెర క్రాంతికుమార్. డ్రిల్ మ్యాన్‌గా పేరొందిన క్రాంతికుమార్.. దేశ, విదేశాల్లో చేసిన సాహసాలపై ప్రత్యేక కథనం.

# సాహసాల డ్రిల్ మ్యాన్

## సామాన్యుడి నుంచి అసామాన్య వ్యక్తిగా..



గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించిన క్రాంతికుమార్

- ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలకు మారుపేరు
- దేశ, విదేశాల్లో ప్రదర్శనలు
- ఇటలీలోని మిలాన్ నగరం వేదికగా గిన్నిస్ రికార్డులు
- 60 సెకన్లలో నాలుకతో 57 ఫ్యాన్లను ఆపిన డ్రిల్‌మ్యాన్
- సాధ్యంకాని మరో మూడు ప్రదర్శనలు కూడా..

**టాలెంట్‌కు ఏదీ అడ్డురాదని నిరూపించిన పనికెర క్రాంతికుమార్**

టాలెంట్

**సూర్యాపేట:** డ్రిల్‌మ్యాన్‌గా పేరొందిన పనికెర క్రాంతికుమార్‌ది యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు. తండ్రి పనికెర సత్తయ్య తాపీ మేస్త్రీ. తల్లి రోజువారీ వ్యవసాయ కూలీ. ఇతనికి అన్నయ్య, చెల్లె ఉన్నారు. 1నుంచి 5వ తేదీ వరకు అడ్డగూడురులో, 6 నుంచి 10వ తరగతి వరకు శాలి గౌరారం జెడ్పీహెచ్ఎస్‌లో విద్యాభ్యాసం కొనసాగించాడు. ఆ తరువాత సూర్యాపేటకు వచ్చి ఇంటర్ మణికంఠ జూనియర్ కళాశాలలో హెచ్ఈసీ విభాగంలో చేరాడు. ఇంటి నుంచి తల్లిదండ్రులు పంపే డబ్బుల కోసం చూడకుండా మిర్చి బండీ వద్ద పనిచేసేవాడే. ఈ క్రమంలోనే మిర్చిబండి వద్ద వేడివేడి నూనెలోంచి బజ్జీలను తీయడం సాధన చేసేవాడు. ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ పూర్తి చేశాడు. డిగ్రీ కూడా సూర్యాపేటలోని మహర్షి కాలేజీలో పూర్తిచేశాడు. అనంతరం తమిళనాడులోని అన్నామలై యూనివర్సిటీలో ఎంఎస్సీ యోగా చేశాడు. కొంతకాలంగా సూర్యాపేటలోనే నివాసం ఉంటున్నాడు.

**దేశ, విదేశాల్లో ప్రదర్శనలు**

ముక్కులో నాలుగు ఇంచుల డ్రిల్ (గోడలను రంధ్రాలు చేసే మిషన్) వేసుకోవడం, మేకులను కొట్టుకోవడం వంటి ప్రదర్శనలు చాలాచోట్ల చేశాడు. ప్రధానంగా 2011లో ఇండియాస్ గాట్ టాలెంట్ షోలో కాంత్రి ప్రదర్శించిన విన్యాసాలతో వెలుగులోకి వచ్చాడు. వివిధ తెలుగు ఛానళ్లలోనూ విన్యాసాలు ప్రదర్శించి డ్రిల్ మ్యాన్‌గా పేరు తెచ్చుకున్నాడు. ఈ ప్రదర్శనలను ఇక్కడికే పరిమితం చేయకుండా దేశ, విదేశాల్లోనూ ప్రదర్శించాడు. అమెరికాతో పాటు మలేషియా, సింగపూర్, స్పెయిన్, ఇటలీలోనూ విన్యాసాలు ప్రదర్శించి రికార్డులు సృష్టించాడు. క్రాంతికుమార్‌ను భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ ఎంతగానో ప్రోత్సహించాడు. మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి ఆర్థికంగా చేయూతనిచ్చారు.

**యూనిక్‌గా ఉండాలన్న పట్టుదలతో..**

క్రాంతికుమార్ నాలుగు గిన్నిస్ వరల్డ్ రికార్డులను సాధించడం వెనుక అలుపెరగని సాధన, శ్రమ దాగి ఉంది. ప్రధానంగా అందరిలో గుర్తింపు ఉండాలన్న పట్టుదలతో చదువే కాకుండా ఏదోఒక రంగంలో ఎదగాలని భావించాడు. ఈ నేపథ్యంలోనే ఎవరికీ సాధ్యంకాని పనులు చేయాలన్న భావనతో ఇంటర్ నుంచే చిన్నచిన్న ప్రదర్శనలు సాధన చేస్తుండేవాడు. ప్రధానంగా వేడివేడి నూనెలోంచి బజ్జీలను తీయడం, ముక్కులో మొలలు (సీలలు) కొట్టుకోవడం వంటివి సాధన చేస్తుండేవాడు. వీటిని కాలేజీలో, ఇతర చోట్ల ప్రదర్శించడం ప్రారంభించాడు. ఈ ప్రదర్శనలను చూసి క్రాంతికుమార్‌ను సూర్యాపేటకు చెందిన పేరిణీనృత్య కళాకారుడు వెంకట్ వెన్నంటి ప్రోత్సహించాడు.



**గిన్నిస్‌లో చోటిలా..**

క్రాంతికుమార్ గిన్నిస్ వరల్డ్ బుక్‌లో చోటు సంపాదించడమే ధ్యేయంగా శ్రమించాడు. ఎన్ని కష్టలు వచ్చినా భరిస్తూ ముందుకు సాగాడు. 2024 ఫిబ్రవరిలో ఇటలీలోని మిలాన్ నగరంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు నిర్వాహకుల ఎదుట నాలుగు ప్రదర్శనలు చేసి అన్నింటా సత్తా చాటాడు. ఎవరికీ సాధ్యంకాని రీతిలో ప్రతిభను చాటి ఒకేసారి నాలుగు రికార్డులు సాధించాడు.

- మొదటిది 60 సెకన్లలో 57 టేబుల్ ఫ్యాన్లను నాలుకతో ఆపి ఔరా అనిపించాడు.
- రెండవది కత్తులను గొంతులో పెట్టుకుని తాడు సాయంతో 1,944 కిలోల బరువున్న వాహనాన్ని ఐదు మీటర్ల మేర లాగి రెండో రికార్డు,
- 60 సెకన్లలో 22 సార్లు నాలుగు అంగుళాల మేకులను ముక్కులో కొట్టుకోవడం మూడో రికార్డు
- నాలుగు రికార్డ్ 300 డిగ్రీల వేడి నూనెలో 60 సెకన్లలో 17 చికెన్ ముక్కలను బయటకు తీశాడు.

# ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**భానుపురి (సూర్యాపేట):** ప్రభుత్వ భూములను సంరక్షించాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శనివారం సూర్యాపేట కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి ఆర్డీఓలు, తహసీల్దార్లతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వ భూమి ఒక్క ఇంచు కూడా కబ్జా కాకుండా చూడాలన్నారు. ఇరిగేషన్, జాతీయ రహదారుల కోసం సేకరించిన భూసేకరణ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. భూ సమస్యల కోసం ప్రజావాణిలో పెట్టిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. రెవెన్యూ శాఖలో నూతనంగా 47మందికి గ్రూప్–4 ఉద్యోగాలు ఇచ్చామని, వారందరికి ప్రజలతో ఎలా ప్రవర్తించాలో అవగాహన కల్పించాలన్నారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్లను పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. సోమవారం ఓటరు తుది జాబితాను ప్రచురించి విడుదల చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో కోదాడ, సూర్యాపేట ఆర్డీఓలు సూర్యనారాయణ, వేణు మాధవ్, శ్రీనివాసులు, అధికారులు శ్రీనివాసరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సాయి గౌడ్, శ్రీనివాస రాజు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**రోడ్డు ప్రమాదాలను నియంత్రించాలి**

అజాగ్రత్త, అధిక వేగం వల్ల జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నియంత్రణకు నిరంతరం తనిఖీలు చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి వికాస్ రాజ్‌తో కలిసి రోడ్డు భద్రతా ప్రమాణాలు, మాసోత్సవాలు నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌కు హాజరైన అనంతరం కలెక్టర్.. వివిధ శాఖల అధికారులతో సమావేశమై మాట్లాడారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు కూడా ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కలిగి ఉండేలా రంగోలి, వ్యాసరచన, డ్రామా పోటీలు నిర్వహించాలన్నారు. ఈనెల 8న అన్ని మండలాల్లోని హైస్కూల్స్, జూనియర్ కాలేజీలలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 9న మోటార్ సైకిల్ ర్యాలీ, భారీ వాహన డ్రైవర్లకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్టీఓ సురేష్ రెడ్డి, అధికారులు జయప్రకాష్‌రెడ్డి, ఆదిత్య, బాను నాయక్, అశోక్, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఆటోను ఢీకొట్టిన ట్రాక్టర్

● ఒకరు మృతి.. ముగ్గురికి గాయాలు

**మిర్యాలగూడ టౌన్:** ఆటోను ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం రాత్రి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామ శివారులో జరిగింది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ–2 సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం పట్టణంలోని రాపర్తి నగర్‌కు చెందిన సట్టు వెంకటేశ్వర్లు (35)తో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరులోని అమరావతి రోడ్డు ప్రాంతానికి చెందిన ముటుకూరి రమ్య, బి. సత్యవతి కలిసి శుక్రవారం మిర్యాలగూడ మండలం బి. అన్నారం గ్రామంలో తమ సమీప బంధువు దహన సంస్కారాలకు హాజరై అదే గ్రామానికి చెందిన నిమ్మల నవీన్ ఆటోలో మిర్యాలగూడకు వెళ్తున్నారు. ఈ క్రమంలో మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామ శివారులో కోదాడ–జడ్చర్ల హైవేపై దమ్ము చక్రాలతో వెంకటాద్రిపాలెం వైపు వస్తున్నట్రాక్టర్ ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న వెంకటేశ్వర్లు, నవీన్, రమ్య, సత్యవతికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని ఆస్పత్రికి తరలించగా సట్టు వెంకటేశ్వర్లు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంకటేశ్వర్లు మృతదేహాన్ని మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించారు. శనివారం మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

### కాలువలో పడిన ట్రాక్టర్.. ఒకరు మృతి

**అనంతగిరి:** అదుపుతప్పి ట్రాక్టర్ ఎస్ఎస్పీ కాలువలో పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన అనంతగిరి మండల కేంద్రంలో శనివారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతగిరి మండల కేంద్రానికి చెందిన బండి వెంకట్రామయ్య(36) తన వ్యవసాయ పొలానికి నీళ్లు పెట్టేందుకు శనివారం ఉదయం భార్య కావ్య, కుమార్తె అనూషతో కలిసి ట్రాక్టర్‌పై పొలానికి వెళ్లాడు. భార్య, కుమార్తె పొలం వద్ద ట్రాక్టర్ దిగారు. ఎస్ఎస్పీ కాలువ నుంచి పొలంలోకి నీళ్లు పెట్టేందుకు వెంకట్రామయ్య ట్రాక్టర్‌పై కాలువ కట్ట మీదుగా వెళ్తుండగా కట్టపై కంపచెట్లను తప్పించబోయి ట్రాక్టర్‌ను ఎడమవైపు తిప్పడంతో అదుపుతప్పి కాలువలో పడింది. ట్రాక్టర్ వెంకట్రామయ్యపై పడడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సహాయంతో మృతదేహాన్ని కాలువ నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు.

### హుండీలో నగదు చోరీ

**అనంతగిరి:** మండల కేంద్రంలోని అనంతగిరి కొండపై గల అయ్యప్ప దేవాలయంలో హుండీని శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి రూ.10వేల నగదు ఎత్తుకెళ్లారు. అంతేకాకుండా వంటగది, స్టోర్‌రూం తలుపులు, బీరువా పగులగొట్టారని ఆలయ ట్రస్ట్ చైర్మన్ కొండపల్లి మురళీకృష్ణ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు.

# రాష్ట్రస్థాయికి 25 ఎగ్జిబిట్లు ఎంపిక

● ఇన్‌స్పైర్ మనక్‌లో 11, ఆర్ఎస్‌బీవీపీ విభాగంలో 14
● ముగిసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

**నల్లగొండ :** నల్లగొండలోని డాన్‌బాస్కో స్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పలు ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. మొత్తం 236 ప్రాజెక్టుల్లో 10 శాతం ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. ఇన్‌స్పైర్ మనక్‌లో 11 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. మొత్తం 25 ప్రాజెక్టులను ఎంపిక చేసి.. విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

**ఇన్‌స్పైర్ మనక్‌లో రాష్ట్ర స్థాయికి ప్రాజెక్టులు**

- పెద్దవూర మండలం ఎంపీయూపీఎస్ ఉట్లపల్లి పాఠశాలకుచెందిన పి.రుషి తయాచేసిన సోలార్ అంబరిల్లా ప్రాజెక్టు
- చండూరు మండలం మరియనికేతన్ పాఠశాలకు చెందిన పనస విక్రమ్ తయారు చేసిన సోలార్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ ఎనర్జీ ప్రాజెక్టు.
- దేవరకొండలోని టీఎస్ మోడల్ స్కూల్‌కు చెందిన సిరిచందన తయారు చేసిన ఎలక్ట్రిక్ స్లిప్పర్స్ ఫర్ ఉమెన్ ప్రొటక్షన్.
- దామరచర్ల మండలం జెడ్పీహెచ్ఎస్ కొండ్రపోల్‌కు చెందిన బైరం రుష్మంత్ తయారు చేసిన స్నేక్ బైట్ ప్రొటక్టర్ షూ.
- గుర్రంపోడు మండలం పోచంపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన పోలేని మేఘన తయారు చేసిన ఆటోమెటిక్ రైల్వే గేటు సిస్టమ్.
- కనగల్ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన చిత్రం తాత్విక్ తయారు చేసిన వాటర్ షెట్యూలర్ ఫర్ అగ్రికల్చర్ ఫీల్డ్స్.
- కేతేపల్లి మండలం చెరుకుపల్లి కేజీబీవీకి చెందిన గుండపూరి భవాని తయారు చేసిన మల్టీపర్పస్ అగ్రికల్చర్ మిషన్.
- మిర్యాలగూడ కేజీబీవీకి చెందిన రమావత్ రామతులసి తయారు చేసిన ఉమెన్ సేఫ్టీబ్యాగ్.
- నల్లగొండ శాస్త్ర హైస్కూల్‌కు చెందిన పానుగోని తపస్వి తయారు చేసిన ఎలక్ట్రిసిటీ ప్రొడ్యూస్డ్ బై బైసైక్లింగ్.
- నకిరేకల్ జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన కదిరి చందు తయారు చేసిన హోం మేడ్ ఇన్‌సెక్టికిల్లర్స్ నేచురల్ పెస్టిసైడ్స్.
- చింతపల్లి మండలం కురంపల్లి జెడ్పీహెచ్ఎస్‌కి చెందిన అందుగుల శివతులసి తయారు చేసిన సేఫ్టీ ఎలక్ట్రిక్ స్ట్రీట్ పోల్.

**ఆర్ఎస్‌బీవీపీ విభాగంలో..**

**జూనియర్..**

- జిల్లా పరిషత్ కేతేపల్లి, కట్టంగూర్ పాఠశాలలకు చెందిన కార్తిక్, శ్రీవిద్యతో పాటు బెటాలియన్‌లో చదివే అజయ్‌లు తయారు చేసిన ఫుడ్ హెల్తు అండ్ హైజనిక్ ప్రాజెక్టు.
- దేవరకొండ రోడ్డు సందీప్ హైస్కూల్, టీజీఎస్ అనుముల గురుకుల పాఠశాలకు చెందిన యశ్వంత్, కృతిక, శశాంక్‌లు తయారు చేసిన ట్రాన్స్‌పోర్టు అండ్ కమ్యునికేషన్ థీమ్.
- అదే విధంగా నకిరేకల్ జెడ్పీహెచ్ఎస్ త్రిపురారం ఆల్ఫా హైస్కూల్‌కు చెందిన రవితేజ, సమీర్ నేచురల్ ఫామింగ్ ప్రాజెక్టు.
- జెడ్పీహెచ్ఎస్ బకల్‌వాడ, సందీప్ హైస్కూల్ నల్లగొండకు చెందిన జి.జయంత్, ఎం.జయంత్ డిజాస్టర్ మేనేజిమెంట్.
- అన్నెపర్తి 12వ బెటాలియన్, త్రిపురారం ఆల్ఫా హైస్కూల్, జెడ్పీహెచ్ఎస్ కేశరాజుపల్లి విద్యార్థులు ప్రవల్లిక, వేదనాథ్, కెన్నిజాయ్ తయారు చేసిన మేథమెటికల్ మోడలింగ్, కాంపిటీషనల్ థింకింగ్,
- కేశరాజుపల్లి జెడ్పీహెచ్ఎస్, నల్లగొండలోని సందీప్ స్కూల్, దేవరకొండ టీజీఎంఎస్ విద్యార్థులు ఎలిశ, హర్ష, సంధ్యలు తయారు చేసిన వేస్ట్ మేనేజ్‌మెంట్.
- నల్లగొండ మండలం అనంతారం ఎంపీయూఎస్, దేవరకొండ జీహెచ్ఎస్, సందీప్ హైస్కూల్‌కు చెందిన డేవిడ్ రాజు, శరత్, మేఘన తయారు చేసిన రీసోర్స్ మేనేజిమెంట్ ప్రాజెక్టు.

**సీనియర్..**

- నల్లగొండ బాలికల హైస్కూల్, మిర్యాలగూడ జెడ్పీ బాలికల హైస్కూల్, తిప్పర్తి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన అంజలి, ఏకాంబరేశ్వరి, సాయివర్ష తయారు చేసిన ఫుడ్ అండ్ హెల్తు హైజనిక్.
- త్రిపురారం ఆల్ఫా హైస్కూల్, తిప్పర్తి, కట్టంగూర్ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన సౌజన్య, సాయి కుమార్, వరుణ్‌తేజ్ తయారు చేసిన ట్రాన్స్‌పోర్టు అండ్ కమ్యునికేషన్.
- కొండమల్లేపల్లి, సల్కునూర్, నక్కలపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన సాయివర్షిత, వరుణ్, దుర్గ భవాని తయారు చేసిన నేచురల్ పామింగ్.
- తిప్పర్తి టీఎస్ఎంఎస్, కట్టంగూర్ జెడ్పీహెచ్ఎస్, నల్లగొండ బాలికల హైస్కూల్‌కు చెందిన సాయిరామ్, సన్ని, మనీషా తయారు చేసిన డిజాస్టర్ మేనేజ్‌మెంట్.
- దేవరకొండ, నల్లగొండ మాన్యంచెల్క జీజీహెచ్ఎస్ ఉర్దూ మీడియం, ముశంపల్లి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన వంశీకృష్ణ, మతీన్, నందిని తయారు చేసిన మేథమెటికల్ మోడలింగ్ అండ్ కాంపిటీషనల్ తింకింగ్.
- ఆల్ఫా హైస్కూల్ త్రిపురారం, ఎలికట్టె నక్కలపల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలకు చెందిన సునయన, సాయి రిత్విక్, మచ్చగిరి తయారు చేసిన వేస్ట్ మేనేజ్‌మెంట్.
- బొట్టుగూడ, దేవరకొండ, బంగారిగడ్డ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన మహేష్, రాఘవేంద్ర, జి.గణేష్ తయారు చేసిన రీసోర్స్ మేనేజ్‌మెంట్.

ఇన్‌స్పైర్ మనక్ విభాగంలో..



షీల్డ్, సర్టిఫికెట్లు అందజేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి



పనస విక్రమ్



సిరిచందన



రుష్మంత్



మేఘన



చిత్రం తాత్విక్



గుండపూరి భవాని



రమావత్ రామతులసి



పానగోని తపస్వి



చందు



శివతులసి



ఆర్ఎస్‌బీవీపీ జూనియర్ విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికైన వారికి విద్యార్థులకు షీల్డ్, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తదితరులు



ఆర్ఎస్‌బీవీపీ సీనియర్ విభాగంలో రాష్ట్రస్థాయికి ఎంపికైన వారికి షీల్డ్, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

### కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు



మాట్లాడుతున్న పద్మశ్రీ అవార్డు గ్రహీత కూరెళ్ల విఠలాచార్య

**నల్లగొండ టూటౌన్:** కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. శనివారం ఎంజీయూలో తెలుగు శాఖ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఆచార్య రవ్వా శ్రీహరి సాహిత్యం–సమాలోచన అనే అంశంపై నిర్వహించిన ఒక్కరోజు జాతీయ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. క్రమశిక్షణకు, నిబద్ధతకు రవ్వా శ్రీహరి నిదర్శమన్నారు. తెలుగు భాష, సాహిత్యానికి, వ్యాకరణ శాస్త్రానికి రవ్వా శ్రీహరి చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. శ్రీహరి సాహిత్యానికి ఎందరో అభిమానులు ఉన్నారన్నారు. అనంతరం తెలుగు అకాడమీ పూర్వ అధ్యక్షుడు కె. యాదగిరి, పద్మశ్రీ అవార్డు గ్రహీత కూరెళ్ల విఠలాచార్య మాట్లాడుతూ.. 30 వేల పదాలతో రవ్వా శ్రీహరి రూపొందించిన నిఘంటువు ఎంతో బాగుందన్నారు. అన్నమయ్య సాహిత్యంలోని అంశాలను వెలుగులోకి తెచ్చిన ఖ్యాతి ఆయనకే దక్కిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. అరుణప్రియ, ప్రొ. అంజిరెడ్డి, ఆనంద్, మద్దిరాల సత్యనారాయణరెడ్డి, జి. నర్సింహ, అనితకుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

### వ్యాధుల నివారణలో ఔషధ మొక్కలు కీలకం



మాట్లాడుతున్న రిటైర్డ్ ప్రొఫెసర్ ముస్తఫా

**నల్లగొండ టూటౌన్:** మనుషులకు వచ్చే వ్యాధుల నివారణలో ఔషధ మొక్కలు కీలకమని కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ ముస్తఫా అన్నారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీలో శనివారం వృక్ష శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో ఔషధ మొక్కలపై నిర్వహించిన ఉపన్యాస కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వృక్షాల వర్గీకరణ, ఔషధ మొక్కలు, వృక్షజాతుల గుర్తింపు చాలా అవసరమని, నేడు చాలా మంది మొక్కల పేర్లు కూడా తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదన్నారు. వ్యాధుల నివారణలో మొక్కల ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మానవ మనుగడకు మొక్కల ఆవశ్యకత, సంరక్షణ గురించి వివరించారు. కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగ అధిపతి, ప్రిన్సిపాల్ ప్రేమ్‌సాగర్, అధ్యాపకులు శ్రీను, వై. వెంకటేశ్వర్లు, టి. నరసింహస్వామి, శ్రావ్యపురి పాల్గొన్నారు.

### ఎన్జీ కళాశాలలో జాబ్ మేళా



పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

**రామగిరి(నల్లగొండ):** నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో శనివారం జాబ్ మేళా నిర్వహించారు. డిగ్రీ, పీజీలో కంప్యూటర్ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు నల్లగొండ ఐటీ టవర్‌లో గల బెన్ పార్క్ గ్లోబల్ సాఫ్ట్‌వేర్ అండ్ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా 20 మంది ఉద్యోగానికి ఎంపికైనట్లు కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ బొల్లంపల్లి అరుణ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ ఉద్యోగులు నవీన్, మానస, యామిని, ప్రియవర్ధన్, అనూష, మణిదీప్, మహిమ పాల్గొన్నారు.

## బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఇద్దరు మృతి

● మరో ఇద్దరికి గాయాలు



పొలంలో పడిపోయిన బైక్



కారులో నుంచి డ్రైవర్ సందీప్‌ను బయటకు తీస్తున్న స్థానికులు

**తిప్పర్తి:** బైక్‌ను వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో ఇద్దరు మృతిచెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం తిప్పర్తి మండల కేంద్రం సమీపంలో జరిగింది. తిప్పర్తి ఎస్ఐ సాయి ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలం దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన గంధం శ్రీనివాస్(35) నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని హ్యాపీ హోమ్స్ గేటెడ్ కమ్యూనిటీలో నివాసముంటున్నాడు. శ్రీనివాస్ శనివారం పని నిమిత్తం బైక్‌పై తిప్పర్తికి వెళ్తుండగా.. నార్కట్‌పల్లి –అద్దంకి రహదారిపై తిప్పర్తి మండల కేంద్రం సమీపంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయం వద్ద వెనుక నుంచి కారు వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ పక్కనే ఉన్న పొలంలోకి దూసుకెళ్లగా.. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్ అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్‌ను ఢీకొట్టిన అనంతరం కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న గుంటూరుకు చెందిన కొండసాని శిరీష(39) కారులో నుంచి ఎగిరి పక్కనే ఉన్న పొలంలో పడి మృతిచెందింది. కారు డ్రైవర్ టంగుటూరి సందీప్‌తో పాటు అదే కారులో ప్రయాణిస్తున్న మరో మహిళ రూపూడి రాణికి తీవ్ర గాయాలయ్యాయి. అయితే కొండసాని శిరీష, రూపూడి రాణి క్యాటరింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నారని, శిరీష ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఆమె రాణిని తోడుగా తీసుకుని టంగుటూరి సందీప్ కారులో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించుకుని తిరిగి గుంటూరుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడు గంధం శ్రీనివాస్ భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. శ్రీనివాస్‌కు ఇద్దరు పిల్లలు ఉన్నారని, శిరీషకు కూడా ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిపారు.

### యాదగిరి కొండపై డ్రోన్ చక్కర్లు

**యాదగిరిగుట్ట:** యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిసరాల్లో శనివారం డ్రోన్ కెమెరా చక్కర్లు కొడుతూ కనిపించింది. ఆర్ఐ శేషగిరిరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలుకు చెందిన ఓ యువకుడు హైదరాబాద్‌కు చెందిన తన స్నేహితులతో కలిసి యాదగిరీశుడిని దర్శించుకునేందుకు శనివారం సాయంత్రం వచ్చాడు. బ్రేక్ దర్శనం పూర్తయిన తర్వాత సదరు యువకుడు తనతో తెచ్చుకున్న డ్రోన్‌ను ఆలయ ఉత్తర మాడ వీధిలో నిల్చోని ఆన్ చేసి ఆలయాన్ని చిత్రీకరించేందుకు యత్నించాడు. వెంటనే అక్కడ ఉన్న ఎస్‌పీఎఫ్, హోంగార్డు సిబ్బంది, ఆలయ సిబ్బంది అప్రమత్తమై ఆర్ఐ శేషగిరిరావు ఆదేశాలతో చిత్రీకరించకుండా ఆపివేశారు. అక్కడికి చేరుకున్న ఆర్ఐ శేషగిరిరావు యువకుడి వద్ద ఉన్న డ్రోన్ కెమెరాను తీసుకొని, ఆలయ డో భాస్కర్‌రావుకు సమాచారం ఇచ్చారు. ఈఓ అందుబాటులో లేకపోవడంతో డ్రోన్ కెమెరాను సీజ్ చేసి, ఆదివారం ఈఓ వచ్చిన తర్వాత విచారణ చేసి, తదుపరి చర్యలు తీసుకుంటామని ఆర్ఐ శేషగిరిరావు వెల్లడించారు. డ్రోన్ కెమెరాలో ఆలయ పరిసరాలు రికార్డు కాలేదని ఆయన పేర్కొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



దొరగ సహని (ఫైల్)

**వేములపల్లి:** రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామంలో జరిగింది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రంలోని తూర్పు చంపార జిల్లాకు చెందిన దొరగ సహని(45) తన కుమారుడు ప్రదీప్‌కుమార్ సహనితో కలిసి మూడు నెలల క్రితం వేములపల్లికి వలస వచ్చి శెట్టిపాలెం గ్రామ శివారులోని మహర్షి రైస్ మిల్లులో హమాలీగా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి ప్రదీప్‌కుమార్ సహని మిల్లు ఎదురుగా అద్దంకి–నార్కట్‌పల్లి రహదారికి అవతల వైపు దుకాణం వద్ద కూర్చొని ఉండగా అతడిని తీసుకొచ్చేందుకు దొరగ సహని రోడ్డు దాటుతుండగా అదే సమయంలో మిర్యాలగూడ నుంచి నల్లగొండ వైపు వెళ్తున్న కారు బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. శనివారం ఉదయం మృతుడి కుమారుడు ప్రదీప్‌కుమార్ సహని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య సునీతాదేవి, ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

## ఉలిక్కిపడిన పెద్దకందుకూరు



పేలుడు జరిగిన అనంతరం ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ పరిశ్రమ వద్ద గుమికూడిన స్థానికులు

● గ్రామ పరిధిలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ పరిశ్రమలో పేలుడు
● 10 కిలోమీటర్ల వరకు వినిపించిన శబ్దాలు
● ఒకరు మృతి.. ముగ్గురికి గాయాలు

**యాదగిరిగుట్ట రూరల్:** యాదగిరిగుట్ట మండలం పెద్దకందుకూరులోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ పరిశ్రమలో శనివారం భారీ పేలుడు సంభవించడంతో గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. పరిశ్రమలోని ప్రొడక్ట్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ సెంటర్‌లోని పైరో డివైసెస్ ఫిల్లింగ్ అండ్ ప్రెస్సింగ్ బ్లాక్‌లో కెమికల్ పెల్లెట్స్‌ను తూకం వేసే సెక్షన్‌లో జరిగిన పేలుడు ధాటికి జనగామ జిల్లా బచ్చన్నపేటకు చెందిన మార్క కనకయ్య (54) అనే కార్మికుడు మృతిచెందగా.. యాదగిరిగుట్ట మండలం రామాజీపేటకు చెందిన కార్మికుడు మొగిలిపాక ప్రకాశ్‌కు తీవ్ర గాయాలు, మరో ఇద్దరు కార్మికులు జి. వేణుగోపాల్, ఎస్. నర్సింహులుకు స్వల్ప గాయాలయ్యాయి. పేలుడు జరిగిన సమయంలో పరిశ్రమంలోని ఇతర కార్మికులు పరుగులు తీయడంతో స్వల్ప గాయాలయ్యాయి. భారీ శబ్దం కారణంగా వినికిడి సమస్యతో 46 మంది స్థానిక పీహెచ్‌సీలో, భువనగిరిలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రథమ చికిత్స చేయించుకున్నారు.

**పెల్లెట్స్ తూకం వేసే విభాగంలో పేలుడు**

ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ పరిశ్రమలోని పైరో డివైసెస్ ఫిల్లింగ్ అండ్ ప్రెస్సింగ్ బ్లాక్‌లో ఎమ్.టీ.వీ (మెగ్నీషియం, టెఫ్లాన్, వైటన్) అనే రసాయన మిశ్రమం కలిగిన పెల్లెట్‌లను తూకం వేసే విభాగంలో ఉదయం 6 గంటల షిఫ్ట్‌లో 16 మంది కార్మికులు పనిచేస్తున్నారు. 9 గంటలకు కార్మికులు టిఫిన్ చేయడానికి బ్లాక్ నుంచి బయటకు రాగా, మార్క కనకయ్య, మొగిలిపాక ప్రకాశ్, జి. వేణుగోపాల్, ఎస్. నర్సింహులు మాత్రమే అక్కడే ఉండిపోయారు. 9.40 గంటలకు ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించింది. దీంతో తూకం వేసే సెక్షన్ గది రూఫ్ ఎగిరిపోయింది. అదే బ్లాక్‌లో మరో మూడుసార్లు పేలుడు సంభవించింది. ఈ క్రమంలో కార్మికులు వెంటనే బయటకు పరుగులు తీశారు. దాదాపు 10 కిలోమీటర్ల వరకు పేలుడు శబ్దాలు వచ్చాయని స్థానికులు చెబుతున్నారు. మెగ్నీషియం, టెఫ్లాన్, వైటన్ అనే రసాయన మిశ్రమాన్ని తూకం వేసే సమయంలో జరిగిన పొరపాటు వలన పేలుడు జరిగి ఉంటుందని కంపెనీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో 50 నుంచి 100 కేజీల మిశ్రమం ఆ బ్లాక్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.

**ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో వాడే పెల్లెట్స్**

మెగ్నీషియం, టెఫ్లాన్, వైటన్ రసాయన మిశ్రమ పెల్లెట్స్‌ను పూర్తిస్థాయిలో తయారుచేసి ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో వాడుతారని కంపెనీ యాజమాన్యం తెలిపింది. ఈ మిశ్రమాన్ని ఐఆర్ ఫ్లెయర్స్ మిశ్రమం అని అంటారని పేర్కొన్నారు. ఈ రసాయన పెల్లెట్ పదార్థాన్ని ఇవ్వడానికి 4 సంవత్సరాల ఆర్డర్ తీసుకున్నామని, ఇప్పటివరకు రెండున్నర లక్షల యూనిట్స్‌ను అందజేశామని, ఇంకా రెండు లక్షల యూనిట్లు ఎయిర్ ఫోర్స్‌కి అందజేయాలని పరిశ్రమ డైరెక్టర్ తెలియజేశారు.

**రూ.60లక్షల నష్ట పరిహారం, ఒకరికి ఉద్యోగం**

మృతుడు మార్క కనకయ్య కుటుంబానికి రూ.60 లక్షల నష్టపరిహారం, అతడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పిస్తున్నట్లు కంపెనీ యాజమాన్యం శనివారం సాయంత్రం ప్రకటించింది. పరిశ్రమ యాజమాన్యం, అధికార టీఆర్ఎస్‌కేవీ యూనియన్ అధ్యక్షుడు గొంగిడి మహేందర్‌రెడ్డితో పాటు పలు కంపెనీ యూనియన్‌లతో కలిసి చర్చలు జరిపారు. ఈ చర్చల్లో భాగంగా మృతుడి కుటుంబానికి పరిహారం చెల్లించాలని నిర్ణయించారు. అదేవిధంగా వారికి రావాల్సిన పూర్తి బెనిఫిట్స్ అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గాయపడిన వారి వైద్య ఖర్చులు పరిశ్రమ యాజమాన్యం భరిస్తుందన్నారు.